## ఆరు గ్యారెంటీల అమలు ప్రశ్నార్థకమే!

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ అర్బన్, మార్చి 29 : ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించిన పాపానికి ఆర్‌జీ (రాహుల్‌గాంధీ) ట్యాక్స్ చెల్లించుకునే పరిస్థితికి వచ్చిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి డీకే అరుణ విమర్శించారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సుదర్శన్ కన్వెన్షన్ హాల్‌లో బీజేపీ ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన హాజరయ్యారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు సాధ్యంకాని హామీలు ఇచ్చి ఇప్పుడు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రైతు రుణమాఫీ, గృహిణిలకు భృతి, రేషన్‌కార్డులు వంటి అన్ని హామీలు క్వశ్చన్‌మార్క్‌గానే మిగిలిపోతున్నాయన్నారు. కర్ణాటక, తెలంగాణ రెండు రాష్ట్రాల్లో రాహుల్‌గాంధీ టీమ్‌లు దోచుకుంటున్నాయని, అందుకే కర్ణాటక పాలనపై నాయకులు, ప్రజల్లో వ్యతిరేకత మొదలైందన్నారు. రాష్ట్రంలో ఏపార్టీ అధికారంలోకి వచ్చినా ప్రజాసమస్యలపై దృష్టిసారించలేదని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వంలో అవినీతి జరిగిందన్న సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు అవినీతి లేదనేగా ఆ పార్టీ నాయకులను భయపెట్టించి పార్టీలో చేర్చుకుంటున్నారని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో వ్యవహరించడంలేదన్నారు. రాష్ట్రంలో కరువు ముంచుకొస్తుందని.. హైదరాబాద్ సహా అన్ని జిల్లాలో నీటి కష్టాలు ఉన్నాయన్నారు. అయినా రేవంత్‌రెడ్డి మాత్రం ప్రజల కష్టాలను వదిలేసి పార్టీలో చేరికలపైనే దృష్టిసారించారని దుయ్యబటారు. తెలంగాణ పరిస్థితి చూస్తుంటే గజదొంగకు తాళం ఇచ్చిన తీరున ఉందని విమర్శించారు. బీజేపీ గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని చెప్పారు. ప్రతి కార్యక్రమాన్ని పాలమూరు నుంచే మొదలుపెడుతున్నామని.. పాలమూర్, నాగర్‌కర్నూల్ స్థానాలతో పాటు తెలంగాణలో పది ఎంపీ స్థానాలు గెలిచి నరేంద్రమోదీకి బహుమతి అందిస్తామని ధీమావ్యక్తం చేశారు. కార్యక్రమంలో రావుల రవీంద్రనాథ్‌రెడ్డి, నాగురావు నామాజీ, పద్మజారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సతీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## హామీలను అమలు చేస్తున్నాం..

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

ట్యాంక్‌బండ్‌పై ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే యెన్నం, నాయకులు

మహబూబ్‌నగర్‌టౌన్, మార్చి 29 : కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మార్నింగ్‌వాక్‌లో భాగంగా శుక్రవారం ట్యాంక్‌బండ్, పలుప్రాంతాల్లో మహబూబ్‌నగర్ లోక్‌సభ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వంశీచంద్‌ను గెలిపిస్తే కేంద్రం నుంచి మరిన్ని నిధులు తేస్తారని, గెలుపు కోసం సహకరించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ సర్కార్ అమలు చేస్తున్నదన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, మధుసూదన్‌రెడ్డి, వసంత, రాఘవేందర్, చంద్రకుమార్‌గౌడ్ ఉన్నారు.

## ప్రజల సలహాలు, సూచనలే మా మ్యానిఫెస్టో

- మహబూబ్‌నగర్ లోక్ సభ కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి

మహబూబ్‌నగర్‌టౌన్, మార్చి 29 : ప్రజల సలహాలు, సూచనలే మా మ్యానిఫెస్టో అని సీడబ్ల్యూసీ సభ్యుడు, మహబూబ్‌నగర్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో తుక్కుగూడ వేదికగా కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను ప్రకటించి రాష్ట్రంలో ఒక్కొక్కటి అమలు చేస్తున్నామన్నారు. వచ్చేనెల 6వ తేదీన తుక్కుగూడ సభ వేదికగా ఏఐసీసీ కేంద్ర స్థాయి మ్యానిఫెస్టో విడుదల చేస్తున్నట్లు తెలిపారు. మహబూబ్‌నగర్ లోక్‌సభ ప్రజలు ఎం కోరుకుంటున్నారో అదే మ్యానిఫెస్టో రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఎంపీగా గెలిపిస్తే సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యేల సహకారంతో మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ప్రజల కోసం నిరంతరం పని చేస్తూ అందుబాటు లో ఉంటానన్నారు. సమావేశంలో నాయకులు ఎన్పీ వెంకటేశ్, వినోద్‌కుమార్, హర్షవర్ధన్‌రెడ్డి, లక్ష్మణ్‌యాదవ్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సేంద్రియ సాగుపై మొగ్గు చూపాలి

- బీకేఎస్ రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబా

గ్రామ కమిటీ అధ్యక్షుడిని సన్మానిస్తున్న రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబా

నారాయణపేట టౌన్, మార్చి 29 : రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని బీకేఎస్ రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబా అన్నారు. శుక్రవారం ఊట్కూర్ మండలం పగిడిమారిలో బీకేఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతాంగ సమస్యల పరిష్కారానికి రైతులంతా సంఘటితమై పోరాటం చే యాలన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకొని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేయాలన్నారు. రైతులు ఆర్థికంగా ఎదగాలంటే ఉద్యానవన పంటలు, పాడి పరిశ్రమకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రతి రైతు తప్పకుండా బ్యాంకు రుణాలు తీసుకోవాలని, ఇన్సూరెన్స్ చేసుకోవాలని చెప్పారు. అనంతరం బీకేఎస్ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా నాగార్జున, కార్యదర్శిగా రఘునందన్, ఉపాధ్యక్షులుగా అరుణ్, రాజేశ్వర్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా శ్రీనివాసులు, భగవంతు, కోశాధికారిగా అశోక్, సభ్యులుగా ఎల్లప్ప, బీరప్ప, రమేశ్ తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీకేఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ప్రభుమిస్కిన్, మండల కార్యదర్శి మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ‘రైతులను ఆదుకోవాలి’

ధన్వాడ, మార్చి 29 : పంటలు ఎండిపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని నారాయణ పేట జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, ధన్వాడ ఎంపీటీసీ ఉమేశ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు నేటికీ రైతు బంధు ఇవ్వలేదని, రుణమాఫీ చేయలేదని విమర్శించారు.

# చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం

మక్తల్ టౌన్, మార్చి 29: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లాలోని చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నట్లు సీఐ చంద్రశేఖర్ చెప్పారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎస్పీ యోగేశ్‌గౌతమ్ ఆదేశాల మేరకు జిల్లా సరిహద్దుల్లో ఉన్న చెక్‌పోస్ట్‌ల వద్ద కేంద్ర సాయుధ బలగాలతో భద్రత పెంచినట్లు తెలిపారు. నారాయణపేట సరిహద్దులో అంతర్ రాష్ట్ర చెక్ పోస్టు 5+2 అంతర్ జిల్లా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. జలాల్పూర్, దామరగిద్ద, కానుకుర్తి ,కృష్ణ బ్రిడ్జి, చేగుంట వద్ద ఏర్పాటు చేయటంతో పాటు అంతర్ జిల్లా సరిహద్దులోని మరికల్ మండలం లాల్ కోట వద్ద, కోస్గిలోని సంపల్లి గ్రామం వద్ద ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. అక్రమంగా మద్యం బంగారం ఇతర విలువైన వస్తువులు రవాణా చేయకుండా అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించామని పేర్కొన్నారు.

చేగుంట చెక్‌పోస్టు వద్ద వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

# ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు శతగోపం

మక్తల్ టౌన్ మార్చ్ 29: ఎన్నికల సమయంలో తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటికీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే శటగోపం పెట్టి ప్రజలను పక్కదారి పట్టించేందుకు రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని భారత రాష్ట్ర సమితి మక్తల్ నియోజకవర్గ నాయకుడు రాజుల ఆశిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ ఇచ్చిన హామీలు అమలు చేయకుండా గత ప్రభుత్వం చేసిన అప్పుల వల్ల రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేకపోతున్నామంటూ ముఖ్యమంత్రి మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వం ఏర్పాటు చేసి 100 రోజుల పైన అయినప్పటికీ ఉచిత బస్సు ప్రయాణం తప్ప, మిగతా పథకాలు అమలుచేయలేదన్నారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మళ్లీ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని తెరపైకి తెచ్చారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల సంగతేమో గాని కాంగ్రెస్ నాయకుల గారడీ రాష్ట్రంలో అద్భుతంగా ఉందన్నారు. త్వరలోనే తెలంగాణ రాష్ట్రంలో భారత రాష్ట్ర సమితికి పూర్వ వైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాజుల ఆశిరెడ్డి

## దేశంలో నియంత పాలనను అడ్డుకుందాం

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ,మార్చి 29: దేశంలో లౌకికత్వానికి ప్రమాదం ఏర్పడిందని, నియంత పాలనను అడ్డుకోకపోతే భవిష్యత్ తరాలు మనల్ని క్షమించవని చల్లా వంశీచంద్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సీపీఐ మండల కార్యకర్తల సమావేశం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన పదేండ్లలో పేదలు పేదలుగానే, మిగిలారని, ధనవంతులు ఎదిగారన్నారు. అందుకే సమసమాజ స్థాపన కోసం కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. కమ్యూనిస్టులు కాంగ్రెస్‌తో కలిసి చిత్తశుద్ధితో పనిచేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని పిలుపు నిచ్చారు. అనంతరం మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ బీజేపీ నుంచి దేశాన్ని విముక్తి చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాల్ నరసింహ, సీపీఐ జిల్లా కార్యదర్శి బృంగి బాలకిషన్, నారాయణపేట జిల్లా కార్యదర్శి కొండన్న, వనపర్తి జిల్లా కార్యదర్శి విజయరాములు, ఏఐటీయూసీ నాయకులు సురేశ్, సీపీఐ రాష్ట్ర నాయకులు పరమేశ్వర్ గౌడ్, అల్వాల్ రెడ్డి, ఏఐఎస్ఎఫ్ నాయకులు రాము, రాజు తదితరులు పాల్గొన్నారు.

## కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి

పాలమూరు, మార్చి 29 : మహబూబ్‌నగర్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం టెట్, డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయగానే జిల్లా కేంద్రంలో విచ్చలవిడిగా కోచింగ్ సెంటర్లు వచ్చాయని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ అన్నారు. ఎలాంటి అనుమతులు లేకపోయినా నిర్వహిస్తూ.. ఇష్టారీతిన డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. కొంతమంది రాజకీయ నాయకుల ధైర్యం చూసుకొని కనీస సౌకర్యాలు లేకుండానే నడుపుతున్న సెంటర్లపై జిల్లా విద్యాశాఖ అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యం వహిస్తే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని అన్నారు.

## టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శికి సన్మానం

మరికల్, మార్చి 29 : తెలంగాణ రాష్ట్ర మాదిగహక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన మరికల్‌కు చెందిన జోగు రామస్వామిని శుక్రవారం సాయత్రం బీఆర్ఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ బీఆర్ఎస్‌లో చురుగ్గా పనిచేస్తున్న రామస్వామిని రాష్ట్ర టీఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శిగా నియమించడం అభినందనీయమని అన్నారు. రాబోవు రోజుల్లో మరింత ముందుకు సాగాలని అన్నారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నారాయణ, కృష్ణయ్య, జగదీశ్, రాయుడు, వెంకటేశ్‌గౌడ్, రవిగౌడ్, దుబాయి రాములు, సీమబాలకృష్ణ, గూప నర్సిములు, మాసన్న, ఆనంద్, రాములు, కథలప్ప, కొండయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రామస్వామిని సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## మద్యం పట్టివేత

ఉండవెల్లి మార్చి 29 : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళపై కేసు నమోదు చేసిన ఘటన శుక్రవారం చోటు చేసుకున్నది. ఎస్సై శ్రీనివాస్ కథనం ప్రకారం ఉండవెల్లి గ్రామం వీఆర్ కాలనీకి చెందిన ఈడిగ శంకరమ్మ బెల్ట్‌షాపు నిర్వహిస్తూ మద్యం విక్రయిస్తున్నారని సమాచారం మేరకు పోలీస్ సిబ్బందితో కలిసి తనిఖీలు చేయగా 7బీరులు, 84క్వార్టర్లు, 16ఐబీ 90 ఎంఎల్‌లు మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న శంకరమ్మపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

### కొంకలలో ..

వడ్డేపల్లి, మార్చి 29: మండలంలోని కొంకల గ్రామంలో గురువారం రాత్రి ఒక హోటల్‌లో శాంతినగర్ పోలీసులు తనిఖీలు చేశారు. అనుమతులు లేకుండా విక్రయిస్తున్న 8.45లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఎస్సై సంతోష్‌ను వివరణ కోరగా పూర్తిస్థాయి విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

## నిరుద్యోగులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

వనపర్తి టౌన్, మార్చి 29 : ఈనెల 31న డీఎస్సీకి సన్నద్ధమవుతున్న నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత స్టడీ మెటీరియల్‌ను సాయమ్మ–బుచ్చన్న చారిట బుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జంగిడిపురంలో వాగ్దేవి జూనియర్ కళాశాలలో ఉచిత స్టడీ మెటిరియల్‌ను 2వేల మందికి అందజేస్తామని, గతంలో ఎస్సై, కానిస్టేబుల్, గ్రూప్ను నిరుద్యోగులకు 3వేల స్టడీ మెటిరియల్స్‌ను అందజేశామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ట్రస్ట్ చైర్ పర్సన్ పద్మా రాణి తెలిపారు.

## రైతుల శ్రేయస్సే లక్ష్యం

కొత్తకోట, మార్చి 29 : రైతుల శ్రేయస్సే లక్ష్యమని రామకృష్ణాపురం సింగిల్ విండో చైర్మన్ వాసుదేవారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని నాటవెల్లి పెద్ద తండా సింగిల్‌విండో మహాజన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కావాల్సిన పంట రుణాలు, ఎరువులు, సబ్సిడీ విత్తనాలు, ధాన్యం కొనుగోలుతోపాటు సొసైటీలో ఇతర సేవలను అందిస్తున్నామని తెలిపారు. చిన్న,సన్నకారు రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సింగిల్ విండో అభివృద్ధికి తోడ్పడాలన్నారు. సమావేశంలో సొసైటీ డైరెక్టర్లు, ఎంపీటీసీలు లక్ష్మి, లక్ష్మణ్‌నాయక్, దేవి, యుగేందర్‌రెడ్డి, గోవిందునాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సింగిల్‌విండో చైర్మన్ వాసుదేవారెడ్డి

## భూతగాదాల్లో ఇద్దరిపై కేసు నమోదు

పొలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై మంజునాథ్‌రెడ్డి

కొత్తకోట, మార్చి 29 : పొలం తక్కువగా ఉందంటూ మరొకరి పొలంలో చెట్లను జేసీబీ సాయంతో పడగొట్టిన వ్యక్తులపై కొత్తకోట పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై మంజునాథ్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని కనిమెట్టకు చెందిన పేరి కోటేశ్వర్‌రెడ్డికి సర్వేనెంబర్ 126/అ2లో 38గుంటల భూమి ఉంది. కొంత భూమిలో మామిడి చెట్లు, మరి కొంత వరి పంట వేశాడు. అదే సర్వేనెంబర్‌లో బీమా కాల్వ పైభాగాన దొడ్ల రాంచంద్రయ్య, అతడి అన్నద మ్ములకు వ్యవసాయ పొలం ఉంది. పొలం తక్కువగా ఉందంటూ కోటేశ్వర్‌రెడ్డితో తరచూ గొడవ పడేవారు. ఈనెల 28న దొడ్ల రాంచంద్రయ్య, అతడి తమ్ముడు దొడ్ల రాములు పొలం వద్ద ఎవరూ లేని సమయంలో గెట్టుకు ఉన్న చెట్లను తొలగించడంతోపాటు పొలాన్ని చదును చేశారు. విషయం తెలుసుకున్న కోటేశ్వర్‌రెడ్డి పొలం వద్దకు వెళ్లి చెట్లు ఎందుకు తొలగించారని నిలదీశాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు శుక్రవారం ఎస్సై పోలీసు సిబ్బందితో పొలాన్ని పరిశీలించి విచారణ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## మతిస్థిమితం లేని మహిళ కుటుంబం చెంతకు..

మహిళకు ఆశ్రయం కల్పించిన వారిని సన్మానిస్తున్న పోలీసులు

వనపర్తి, మార్చి 29 : మండలంలోని మర్రికుంటలో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న మహిళకు ఓ హోటల్ యాజమాని ఆశ్రయం కల్పించి విషయాన్ని రూరల్ ఎస్సై జలంధర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మహిళతో ఉన్న ఆధార్‌కార్డు ఆధారంగా వివరాలు తెలుసుకొన్నారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల కేంద్రానికి చెందిన విజయగా గుర్తించి ఆమె కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు. మహిళను చేరదీసిన వనపర్తికి చెందిన రాఘవేంద్ర, బాలరాజులను పోలీసులు సన్మానించి అభినందించారు.

## సీఆర్‌పీఎఫ్ జవాన్ అంత్యక్రియలు పూర్తి

హన్వాడ, మార్చి 29 : మండలంలోని వేపూర్ గ్రామానికి చెందిన విష్ణు (28) సీఆర్‌పీఎఫ్ జవాన్‌గా కోల్‌కతాలో విధులు నిర్వహిస్తుండగా గన్ మిస్‌ఫైర్ అయి అతని శరీరంలోకి బుల్లెట్ దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో శుక్రవారం కోల్‌కతా నుంచి మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. వారి ఇంటి నుంచి సొంతపొలం వరకు జై భారత్ నినాదాలతో అంతిమయాత్ర నిర్వహించారు. గ్రామస్తులు, అధికారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మృతదేహానికి మండలంలోని మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు.

ఇంటికి పెద్దకుమారుడి కోల్పోవడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగారు.

## మృతుడి కుటుంబానికి పరామర్శ

నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల

మూసాపేట, మార్చి 29 : మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు వాకిటి యాదయ్య గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలిసిన దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి శుక్రవారం గ్రామానికి వెళ్లి యాదయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ తరపున అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.

## కేకే, కడియం చరిత్రహీనులుగా మిగిలిపోతారు

- దమ్ముంటే పదవులకు రాజీనామా చేయాలి
- బీఆర్ఎస్ మండల నాయకుడు డీకే జనార్దన్

నర్వ, మార్చి29; బీఆర్ఎస్ పార్టీని వదిలివెళ్లిన కె.కేశవరావు, మాజీ మంత్రి కడియం శ్రీహరి చరిత్రహీనులుగా మిగిలిపోతారని తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ మండల నాయకుడు డీకే జనార్దన్ అన్నారు. గురువారం ఆయన నర్వలో విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అధికారం అనుభవించిన నాయకులు, నేడు పార్టీకి అండగా నిలవాల్సిన సమయంలో మరో పార్టీలో చేరి, రాజకీయ రంగులు మార్చడం తగదని, చిత్తశుద్ధి ఉంటే పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్‌లో అత్యధిక సీట్లు వచ్చే విధంగా ప్రతి ఒక్క కార్యకర్త సైనికుడిలా పని చేయాలని విజ్ఞప్తి చేశారు.

## రైతులకు రుణాలు అందజేస్తాం

సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ జితేందర్‌రెడ్డి

మూసాపేట(అడ్డాకుల), మార్చి 29 : రైతులకు రుణాలు అందజేస్తామని సింగిల్‌విండో చైర్మన్ మద్దూరి జితేందర్‌రెడ్డి అన్నారు. అడ్డాకుల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనంలో శుక్రవారం మహాజన సభ నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయా గ్రామాల డైరెక్టర్లు హాజరై వరి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏప్రిల్ 1వ తేదీ నుంచి వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా రైతులు సకాలంలో రుణాలను రెన్యూవల్ చేసుకోవాలని, రుణాలు పొందని వారు ఉంటే వారికి అందస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ శెట్టి నాయక్, డైరెక్టర్లు కావలి కృష్ణయ్య, రాజు, రాజవర్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్, భాస్కర్, మణెమ్మ, బుచ్చన్నగౌడ్, సీఈవో వెంకటయ్య పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీఈ డే వేడుకలు

ఊట్కూర్, మార్చి 29 : గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను క్రమం తప్పకుండా తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్లు రాజేశ్వరమ్మ, రామేశ్వరమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని మల్లేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ డే ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ చిన్నారులు ప్రీ స్కూల్ ఆక్టివిటీస్‌తో అలరించారు. కార్యక్రమంలో భాగంగా పలుపురు చిన్నారులు చీరలు ధరించి ఐసీడీఎస్ పీడీ, సీడీపీవో, సూపర్‌వైజర్, టీచర్లుగా వ్యవహరించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రజక సంఘం ఆధ్వర్యంలో హెల్త్‌క్యాంప్

మహబూబ్‌నగర్అర్బన్, మార్చి 29 : జిల్లా కేంద్రంలోని న్యూగంజ్‌లో రజక సంఘం, యువజన సంఘం ఆధ్వర్యంలో ఏప్రిల్ 7న హెల్త్‌క్యాంప్ నిర్వహించనున్నట్లు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రుద్రారం సత్యం, నాగన్న, రాజు, శివన్న తెలిపారు. కార్యక్రమంలో చికిత్సతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని నిరుపేద కుటుంబాలు, వ్యాధిగ్రస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## జాతరను విజయవంతం చేయాలి

పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

దేవరకద్ర, మార్చి 29 : నియోజకవర్గ కేంద్రంలో పూలే అంబేద్కర్ 4వ జాతరను విజయవంతం చేయాలని జాతర కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడు దొబ్బలి ఆంజనేయులు కోరారు. శనివారం దేవరకద్ర మండల కేంద్రంలోని అంబేద్కర్ కమ్యూనిటీ భవనం వద్ద పూలే అంబేద్కర్ జాతర వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వచ్చే ఈనెల 27న జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ 4వ జాతరను నిర్వహిస్తుమన్నారు. కార్యక్రమంలో నాయకులు కోట ప్రదీప్, రాజు, జగన్మోమన్, నరేశ్, కురుమూర్తి, విజయ్ పాల్గొన్నారు.

## అంబులెన్స్ ఢీకొని వ్యక్తికి గాయాలు

మల్దకల్, మార్చి 29 : మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గురువారం రాత్రి 108 వాహనం ఢీకొని కుర్వ గోవర్ధన్‌కు తీవ్ర గాయాలైన ఘటన చోటుచేసుకున్నది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని అయిజ వెళ్లే దారిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో రోడ్డు పక్కన వెళ్తున్న గోవర్ధన్ అనే వ్యక్తికి 108తవాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే గద్వాల ప్రభుత్వ దవాఖానకు చికిత్స కోసం తరలించారు. పోలీసులు 108 వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రైవర్‌పై క